రహదారి పనులు త్వరగా ప్రారంభించండి : జెడ్పీటిసి డా.ధర్మాన కృష్ణచైతన్య

విశాలాంధ్ర-నరసన్నపేట : నియోజకవర్గంలో రహదారి పనులు త్వరితగతిన ప్రారంభించాలని పోలాకి జెడ్పీటిసి, నియోజకవర్గ యువ నాయకులు, డా. ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన రహదారి కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా రావులవలస, కుద్దాం, మామిడివలస, ఉప్పరిపేట, రెహమాన్‌పురం గ్రామాలకు రహదారి నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని తెలిపారు. ఈ నెలాఖరులోగా పై గ్రామాలకు చెందిన రహదారులు ప్రారంభించి, త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, వైసిపి నాయకులు, ముద్దాడ బైరాగినాయుడు, చింతు రామారావు, రాజాపు అప్పన్న, పెరుమాళ్ళ తవిటినాయుడు, కణితి కృష్ణారావు, దుల్ల వెంకటరమణ, నేతింటి రాజేశ్వరరావు, బొబ్బాది ఈశ్వరరావు, కోటిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ నాయకులకు ఘన నివాళులు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని పి వై జి పుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దేవదాస్ ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు దేవదాస్ మాట్లాడుతూ వల్లభాయ పటేల్ భారత దేశానికి మొదటి హెూం మంత్రిగా పనిచేసి అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారని అన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని పద్మ, తల్లి తండ్రుల కమిటీ ఉప చైర్మన్ ఛాయాదేవి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరసవల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ కూడలి వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎంతోమంది పోరాట యోధులు స్వాతంత్ర సమరయోధులు మనకు స్ఫూర్తిదాయకమని భారతదేశం ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు గురించి పోరాట భాగంగా పొట్టి శ్రీరాములు ప్రాణాలు విడిచారని, ఆయన త్యాగం మరువరాదని నేటి యువతకు వారు ఆదర్శం అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి నరసింహమూర్తి మా ఈస్ట్ కోస్ట్ రైల్వే మాజీ సలహాదారులు, దేశేళ్ల గోవిందా మల్లిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కూరాకుల వెంకటరావు, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ఎస్ ధర్మారావు, రమేష్ కుమార్లు పాల్గొన్నారు.

నిరసనకు తెదేపా నాయకుల మద్దతు

విశాలాంధ్ర-టెక్కలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా జరుగుతున్న అంగనవాడి వర్కర్స్ మరియు హెల్పర్స్ కు జరిగిన నష్టాల పై చేస్తున్న నిరసనకు మద్దతుగా టెక్కలి తహసీల్దార్ కార్యాలయంలో టెక్కలి, నందిగాం మండల అంగన్వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ చేస్తున్న నిరాశనకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు టెక్కలి, నందిగాం మండల నాయకులు, కార్యకర్తలు నిరసన దీక్షకు తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు ముఖ్యమంత్రి అయ్యాక మర్చిపోయారని అందువలన ప్రతి అక్క చెల్లెలు నిరసన తెలుపుతున్న పట్టించుకునే నాయకులే లేరని మాట తప్పను మడము తిప్పను, నేనున్నాను నేను విన్నాను అని పెద్ద పెద్ద వాగ్దానాలు చేసి నేడు వాగ్దానాలను గాలికి వదిలేసారని అన్నారు. ఈ కార్యక్రమం లో టెక్కలి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, నందిగాం మండల అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, జిల్లా పార్లమెంటరి ఉపాధ్యక్షులు హనుమంతు రామకృష్ణ,మామిడి రాము,మట్టా పురుషోత్తం,సుందరమ్మ,కోళ్ల లవకుమార్,ఇప్పిలి జగదీష్,బసవల అప్పలస్వామి, పోలాకి షణ్ముఖ్ రావు, దల్లి ప్రసాద్ రెడ్డి, పేరా మురళి,సోదుముడి శివకిరణ్,మల్లిపెద్ది మధు,ప్రఫుల్ల పరిడ,పంగ మన్మద రావు, పోలాకి ఢిల్లేశ్వర రావు, దాసరి వాసు, అన్నెపు వాసు, బొల్ల యోగి, గేదిల జగదీశ్, ఎర్రబ్బాయి, బమ్మిడి మురళి, బొడ్డేపల్లి రామారావు, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలన జనరంజకం : ఎంపీపీ డాక్టర్ దాసు

విశాలాంధ్ర-సోంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలన జనరంజకంగా ఉందంటూ సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు పేర్కొన్నారు. ఈ మండలం తాళ్లభద్ర గ్రామంలో శుక్రవారం ఈ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ముందుగా తాళ్లభద్ర గ్రామానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను తెలిపే వివరాలతో కూడిన డాష్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల చెంతకు పరిపాలన తీసుకు వచ్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని అన్నారు. మహాత్ములు కలలు గన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాధ్యమైందని వివరించారు. రైతుల అవసరాలను తీర్చేందుకు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ప్రతి గ్రామంలో హెల్త్ క్లీనిక్‌ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, ప్రతి నెల 1వ తేదీ నాటికే సామాజిక పింఛన్లు పంపిణీ మొదలైన కార్యక్రమాలు నభూతో నభవిష్యత్ అని అభివర్ణించారు. తాళ్లభద్ర గ్రామంలో గడచిన నాలుగేళ్లలో అభివృద్ధికి, సంక్షేమానికి 14 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కృష్ణారావు, శిలగాన భాస్కరరావు, తిరుపతి, గిరీష్, కామేశ్వరరావు, కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

మరువాడలో భూ రీసర్వే ప్రారంభం : సర్పంచ్ ధనలక్ష్మి.

విశాలాంధ్ర-సంతబొమ్మాలి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూహక్కు రీసర్వే కార్యక్రమం సంతబొమ్మాలి మండలం మరువాడ పంచాయతీలో శుక్రవారం స్థానిక సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు ప్రారంభించారు. భూసర్వే పరికరాలతో, సంభందిత సర్వే మరువాడ పంచాయతీకి వెళ్లడంతో, స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి దాసరాజు భూమి పూజచేసి సర్వే కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, రైతులు, సర్వే బృందం అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన డా. బిఆర్ఏయూ వీసీ

విశాలాంధ్ర-ఎచ్చర్ల: వర్శిటీలో సుమారు 18 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన డా. వైఎస్ఆర్ బాలుర వసతి గృహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసిన కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లఠకర్, జిల్లా అధికార యంత్రాంగానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి నిమ్మ వెంకటరావు ఆచార్య తమ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఈమేరకు కలెక్టరేట్‌లో కలిసి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి సమావేశాలు, కార్యక్రమాలు విజయవంతం కావడంపట్ల తమ అభినందనలు కలెక్టర్‌కు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో యూనివర్సిటీ నిర్మించిన ఈ ఆధునిక వసతులతో కూడిన ఈ నూతన హాస్టల్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని తమ కెరీర్‌ను మంచి మార్గాన పయనింపచేసుకోవాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ .బి.లఠకర్, ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య సిహెచ్.ఎ. రాజేంద్రప్రసాద్ కూడా పాల్గొన్నారు.

ధనుంజయకు నంది అవార్డు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జానపద కళలు, కోలాటం, పాండురంగ భజన, హార్మోనియం, కీబోర్డులతో ప్రతిభ కనబర్చే ఆల్ ఇండియా కళా రంగం (ఆంధ్రప్రదేశ్) ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిప్పన ధనుంజయరెడ్డి నంది అవార్డుకు ఎంపికైయ్యారు. హైదరాబాద్ కల్చరల్ - మెగా ఎంటర్ప్రైజెస్ ఆల్ క్యాటగిరి సీజన్ నెంబర్-2 క్రింద నంది అవార్డు ఈనెల 17న హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో అందుకోనున్నారు. ఈ మేరకు నిర్వాహకుల నుండి ఆహ్వానం అందదం పట్ల ఆయన అనందాన్ని వ్యక్తం చేసారు. తన గురువుల ఆశీస్సులు కుటుంభం, స్నేహితుల ప్రోత్సాహం, తోటి కళాకారుల సహకారంతోనే తనకు అవార్డు దక్కిందని ఈ సందర్భంగా అన్నారు. మండలంలో టి.బరంపురంకు చెందిన ప్రతిభావంతుడైన కళాకారుడు ధనుంజయ కళారంగంలో నంది అవార్డు ఎంపిక పట్ల స్థానిక ఎమ్పీపి బోర పుష్ప, మాజీ ఎమ్పీపి కారింగి మోహన్ రావు, సర్పంచ్ కారింగి త్రినాథ్, మండల వైసిపి అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్, రంగాల. జానకి రామ్ రెడ్డి, రంగాల కృష్ణారెడ్డి, ఆల్ ఇండియా కళారంగం శ్రీకాకుళం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చలపరాయి రవికుమార్, ఉపాధ్యక్షురాలు ధనవతి, చలపురాయి వినోద్ కుమార్, గ్రామ పెద్దలు యువత కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

డిపట్టా భూ రికార్డులను ట్యాంపరింగ్ చేసిన వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- వర్షాలు కారణంగానే ఆమరణ నిరాహార దీక్ష వాయిదా
- సర్వే చేసి డి పట్టా భూమి ఎస్సీ లబ్ధిదారులకు అప్పగించాలి
- భాధితునికి అండగా సీపీఐ, ప్రజా సంఘాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం మండలం సింగుపురం రెవెన్యూ గ్రామంలో పాత సర్వే నెంబరు 1892/ పి. కొత్త సర్వే నెంబరు 405-1 లో ఎకరా యాభై సెంట్లు డి పట్టా భూమికి సంబంధించి భూమి రికార్డుల్లో ట్యాంపరింగ్ చేయించి,భూ కబ్జాకు పూనుకున్న వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ పార్టీ,ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం నగరంలో గల రామలక్ష్మణ జంక్షన్ వద్ద గల కామ్రేడ్ డి.ఎస్.ఆర్ దాసరి క్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి,సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు అనపాన షణ్ముఖ రావు,బాధితుడు ముడిదాన భాస్కర రావులు మాట్లాడారు. పాత్రునివలస ఎస్సీ కాలనీలో నివసిస్తున్న ముడిదాన గురయ్య తండ్రి సూరయ్యకు శ్రీకాకుళం మండలం సింగుపురం రెవెన్యూ గ్రామంలో పాత సర్వే నెంబరు 1892పి. మరియు కొత్త సర్వే నెంబరు 405 లో విస్తీర్ణం 1.50 ఎకరాలు భూమికి నవంబరు8,1975న ప్రభుత్వం వారు డి పట్టాను అందించియున్నారు.ఆ విషయం డి పట్టా లబ్ధిదారుల రిజిస్టరులో క్రమ సంఖ్య 81లో నమోదు చేయబడి ఉంది.డి పట్టా పోయినందున డూప్లికేట్ డి పట్టాను డాక్టర్. నెం.470/8బి తేదీ 27.8.2008న మండల తహశీల్దార్ శ్రీకాకుళం వారు జారీ చేసియున్నారు. భూమిని సాగు చేసుకుంటూ డి పట్టాదారు కుటుంబం జీవనోపాధి పొందేవారు. కరువు కాటకాలు వలన కుటుంబ పోషణ గడవక మా కుటుంబం వలస వెళ్ళే సమయంలో 2010వ సంవత్సరంలో సింగుపురం పంచాయితీ మున్సబ్ పేట నివాసి అయిన నాగళ్ళ లచ్చుము తండ్రి సూరయ్య అను యాదవ కులానికి చెందిన ఆసామీకి ఏడాదికి రూ.6000/- లు (అక్షరాలు ఆరు వేల రూపాయిలు మాత్రమే)కు కౌలుకు భూమిని ఇచ్చియున్నారు.మూడేళ్ళ క్రితం వరకూ ప్రతీ ఏడాది రూ.6000/- లు చొప్పున నాగళ్ళ లచ్చుము కుమారులు అయిన నాగళ్ళ అప్పన్న, నాగళ్ళ నీలయ్యలు సంక్రాంతి పండగ ముందు ఇచ్చేవారు.కానీ 2020 వ సంవత్సరం ఖరీఫ్ సీజన్ నుండి ఇవ్వవలసిన కౌలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు.డి పట్టా భూమిని సాగు చేసుకొని పంటను పండిస్తూ లబ్ధిపొందుతూ, కౌలు ఇవ్వడానికి నాలుగేళ్ళుగా ఎందుకు తిప్పుతున్నారని అన్నారు. నాగళ్ళ లచ్చుము పేరున రెవెన్యూ రికార్డుల్లో ట్యాంపరింగ్ చేశారు. రికార్డులు పరిశీలించగా 12.11.2014న మండల తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి పని చేసిన సమయంలో ఖాతా నెంబరు.1248లో సర్వే నెంబరు 405-1 విస్తీర్ణం 1.50 ఎకరాలు ఎస్సీ మాల కులానికి మా యొక్క భూమి రికార్డులను ట్యాంపరింగ్ చేసియున్నారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకొని సమగ్రమైన దర్యాప్తు జరిపి నా తండ్రి ద్వారా వారసత్వంగా సంక్రమించిన డి పట్టా భూమిని కౌలుకు చేస్తూ,గత నాలుగేళ్ళుగా కౌలు ఇవ్వకుండా కాలయావన చేస్తూ,ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా తన తండ్రి నాగళ్ళ లచ్చుము పేరిట భూమి రికార్డులు ట్యా%శీ%వరింగ్ చేసి 1బి, అడంగల్,పట్టాదారు పాసుపుస్తకం,టైటిల్ డీడ్ మార్చుకొని,కౌలు సొమ్ము అడిగినందుకు కులం పేరుతో దూషించి,చంపుతామని బెదిరించిన అసామీలపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి,మాకు రావలసిన రూ.24,000/- లు ఇప్పించి, వెబ్ ల్యాండ్ భూమి రికార్డుల్లో నమోదు అయ్యి ఉన్న ఖాతా నెంబరు 1248 సర్వే నెంబరు 405-1 లో విస్తీర్ణం 1.50 ఎకరాలు భూమిని రద్దు చేసి,మా యొక్క డి పట్టా భూమిని సర్వే చేసి హద్దులు ప్రకారం మాకు అప్పగించి, మా పేరు నమోదు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతు యర్రయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు చుక్క రాము, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ సూర్యనారాయణ, మత్స్య కార్మిక సంఘం నాయకులు నాగుల తవుడు తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

విశాలాంధ్ర-పలాస: ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల పలాస ఎ.పి. ఎన్.జి.వోల సంఘం అధ్యక్షులు బోనెల గోపాలరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి ఎం.టి క్రిష్ణబాబును మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా ఈ నెల 14న ప్రారంభించిన పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో పార్మాసిస్టు పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బెందాళం శివప్రసాద్, టి.బాలక్రిష్ణ, సి.హెచ్.విజయ కుమార్‌లు పాల్గొన్నారు.

వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 'దోల జగన్'

విశాలాంధ్ర-నరసన్నపేట : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బి.సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డిసిసిబి మాజీ చైర్మన్, దోల జగన్‌ను నియమితు లయ్యారు. ఈ సంధర్భంగా రాష్ట్ర బిసి సెల్ జోనల్ ఇంఛార్జ్, పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య మర్యాదపూర్వకంగా దోల జగన్‌ను కలిసి, శాలువతో సన్మానం చేసి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలాకి వైసిపి నాయకులు, ముద్దాడ బైరాగినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు, కణితి కృష్ణారావు, జెసిఎస్ కన్వీనర్, కణితి సత్తిబాబు, పోలాకి మండల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభ విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కవిటి : ఈ నెల 20వ తేదిన నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే అశోక్ క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి గ్రామం భూమాత లేఅవుట్ వద్ద ఈనెల 20వ తేదీన యువగలం పాదయాత్ర ముగింపు సభ లో పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర చేనేత విభాగం ఉపాధ్యక్షురాలిగా లీలారాణి

విశాలాంధ్ర - సోంపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గా సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు సతీమణి నిమ్మన లీలారాణిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ నియామకం పట్ల వైకాపా శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం లీలారాణి సోంపేట మండలం సుంకిడి ఎంపీటీసీ సభ్యురాలుగా పని చేస్తున్నారు. ఈ నియామకం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఎంపీపీ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్వాడీల సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర

విశాలాంధ్ర-మందస : అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్‌కై గత రెండురోజులుగా చేస్తున్న సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సహించరానిదని యూనియన్ నాయకులు గణపతి అన్నారు. శుక్రవారం మందసలో అంగన్వాడీలు నల్లచీరలతో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని జిల్లాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో ఇతర శాఖలకు చెందిన సిబ్బందిని, అధికారులను పంపించి తాళాలు పగలగొట్టారని, ఇటువంటి చర్యలు ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి ప్రభుత్వమే దొంగతనానికి పాల్పడుతుందని, ఈ చర్యలు ద్వారా ప్రజలకు ఎలాంటి సంకేతం పంపుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులు విధ్వంసం చేయడం ప్రభుత్వ విధానామా అని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలను వెంటనే మానుకోవాలని సూచించారు. అంగన్వాడీల సమ్మె ముగింపు పలకాలని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చర్చలకు పిలిచి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దిలీప్‌కుమార్, దేవేంద్ర, చిరంజీవిలు, జగ్గారావు, సన్యాసి, ఆనంద్, హైమావతి, హేమలత, హేమావతి, బి.రాజేశ్వరి, క్రిష్ణవేణి, కుమారి, ఉమాలక్ష్మీ, త్రివేణి, ఝాన్సీ, గీత, మాణిక్యం, డి.భాగ్యలక్ష్మీలు పాల్గొన్నారు.

సంఘీభావం : అంగన్వాడీల సమ్మెకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, గౌరవాధ్యక్షులు కొర్ల తేజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావులు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలవి గొంత్తెమ్మకోర్కెలు కావని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. వారి పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు.

సంక్షేమ రాజ్యం జగనన్నకే సాధ్యం: స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-పొందూరు : గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన అనేక ప్రజాహిత కార్యక్రమాలవంటి సంక్షేమ రాజ్యాం జగనన్నకే సాధ్యమని ఆంధ్ర ప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. పొందూరు మండలం బురిడి కంచారం గ్రామంలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాల అమలను తెలుసుకునేందుకు వచ్చిన తమ ఆత్మీయ నేతకు గ్రామ ప్రజలు జేజేలు పలికారు. తమ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజల్లో ఉన్న అపూర్వ ఆదరణను చూసి పులకించిపోయారు. ప్రజాహితం కోరుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సభాపతి వివరించారు. పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైసిపి సర్కార్ కే దక్కిందని స్పీకర్ వివరించారు. ఏ ఏ గడపకు ఎన్నెన్ని సంక్షేమ పథకాలు గత నాలుగున్నర ఏళ్లలో అందాయో సచివాలయ సిబ్బంది సమక్షంలో లబ్ధిదారులకు తెలియజేశారు. ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించి, గ్రామాల రూపు రేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు.ఏదైనా కారణంతో సంక్షేమ పథకాలు అమలు కాకపోతే, అందుకు అవసరమైన ధ్రువపత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందజేయడం జరిగిందన్నారు. రామ రాజ్యాన్ని తలపించే అద్భుతమైన పరిపాలన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో సాకారం అయిందన్నారు. ఎవరికైనా అర్హత లేని కారణంగా సంక్షేమ పథకాలు అమలు కాకపోతే, గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సభాపతి సూచించారు. సంక్షేమ రాజ్యం ఇదేవిధంగా కొనసాగాలంటే,అన్ని వర్గాల ప్రజానీకం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి అంటే, రానున్న ఎన్నికల్లో వైయస్సార్సీపీకి అండదండలు అందించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డికి ఘన విజయం అందించడం ద్వారా సంక్షేమ పథకాలు కలకాలం కొనసాగేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ , మార్కెట్ కమిటీ చైర్మన్ బడాన సునీల్ స్థానిక సర్పంచ్ గంట్యాడ రమేష్,ఎంపీటీసీ బొత్స రమణ కో ఆప్షన్ సభ్యులు ఫీరుసాహెబ్ స్థానిక నాయకులు పిన్నింటి అప్పలనాయుడు వాళ్ల రమణ వందనసాయి వాళ్ల అప్పలనాయుడు తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో నిర్మించకుండానే ప్రారంభించారు

విశాలాంధ్ర-మందస : రాష్ట్ర ముఖ్యమంత్రి పలాస పర్యటనలో ప్రారంభించిన మంచినీటి పథకం నుంచి తమ మండలంలో ఏ ఒక్క గ్రామానికి మంచినీరు రావడం లేదని, ఇంకా పూర్తిస్థాయిలో నిర్మించకుండానే ప్రారంభోత్సవం చేశారని మందస మండల టీడీపీ అధ్యక్షులు బావన దుర్యోదన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావులు అన్నారు. శుక్రవారం మండలం వీరభద్ర గ్రామంలో ఎన్టీఆర్ సుజల పథకం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పలాసలో ప్రారంభించిన కిడ్నీ పరిశోధన కేంద్రంనకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలాస ఎమ్మెల్యే శివాజీలు పది ఎకరాల భూమిని కేటాయించి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఇప్పటికీ ఆ కేంద్రం పూర్తి కాలేదని, ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయిలో సిబ్బంది లేరని అన్నారు. పలాస ప్రభుత్వాసుపత్రిలో కొనసాగు తున్న డయాలసీస్ కేంద్రం పరికరాలన్ని ఇక్కడికి మార్చారని విమర్శించారు. కిడ్నీ వ్యాధి మూలాలను కనుగోనేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని, కనీసం ఒక నెఫ్రాలజిస్టును నియమించకుండానే ఆసుపత్రిని ప్రారంభించారని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు కె.గోపాలరావు, టిడీపీ నాయకులు బమ్మిడి కర్రెయ్య, లింగరాజు, రుద్రయ్య, భాస్కరరావు, నవీన్‌కుమార్, మామిడి తాతారావు, టి.రాజశేఖర్, ప్రవీన్‌కుమార్, జుత్తు అప్పలస్వామి, బి.గున్నయ్య, చిరంజీవి, విక్రమ్, తులసిదాస్, వేణుబాబు, ఢిల్లీశ్వరరావులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో చోరీ

విశాలాంధ్ర-ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీ నగర్ వీధి లోనున్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వేకువ జామున చోరీ జరిగింది. గుడి వెనక వైపు ఉన్న గోడ వైనుండి దూకి తాళాలను పగులు గొట్టి గుడిలోకి వెళ్లి దొంగ తనానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గుడిలో ఉన్న తులం బంగారం ఐదు కేజీల వెండి హుండీలో ఉన్న 30 వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు ఆలయ అర్చకుడు మధు కేసరి శాస్త్రి తెలిపారు. చోరీకి గురైన విషయాన్ని తెలుసుకొని పోలీస్ క్లూస్ టీం అక్కడకు చేరుకొని గుడిని పరిశీలించారు. గురువారం గుడిలో రాత్రి కాపలాదారు గా పనిచేస్తున్న బొబ్బిలి రామారావు అనారోగ్యం కారణంగా విధులకు హాజరు కాలేదు. దేవాలయం ధర్మకర్త తమ్మన రామకృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై. కృష్ణ తెలిపారు.గత కొంత కాలంగా పట్టణంలో వరుసగా మెయిన్ రోడ్డు పై దుకాణాల్లో దొంగతనాలు, గేటు, సొట్ట వానిపేట లోని దేవాలయాలు, బైకులు ఇళ్లలో వరుస దొంగతనాలు జరుగు. తుండ దంతో ప్రజలు బేంబేలెత్తి పోతున్నారు. గత కొంత కాలంగా లక్ష్మీనగర్ వీధిలో రాత్రిపూట పోలీసులు గస్తీ తిరగడం లేదని అక్కడి ప్రజలు చెబుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు గస్తీ ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. అన్ని కూడళ్ళలో ఉన్న సీసీ కెమెరాలను మనుగడ లోకి తేవలసిన అవసరం ఉంది. చోరీ జరిగిన దేవాలయాలలో ముందు రోజు నుంచే రాత్రి కాపలా దారుడు లేకపోవడం గమనార్హం. గేటు వద్ద ఉన్న చెవిటమ్మ తల్లి ఆలయంలో జరిగిన దొంగ తనం లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. అన్ని కోణాల నుంచి దర్యాప్తు నిర్వహిస్తున్నామని దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై కృష్ణ తెలిపారు.

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించండి

విద్యుత్ విలువైనది... వృధా కాకుండా కాపాడుదాం : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఎపిఎస్పీడీసీఎల్ అధికారులను అదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధ్యక్షతన జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 14 వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఎపిఎస్పిడీసీఎల్ అధికారులను ఆదేశించారు. నేటి సత్ సంకల్పం రేపటి వెలుగుకు సహకారం అవుతుందన్నారు. విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా అవుతుందని అందుకు గాను ఇంధన పరిరక్షణ కొరకు ఎల్ఈడి బల్బ్ ల వాడకం గురించి, కరెంట్ ఇస్త్రీ పెట్టెల వాడకం, ఎక్కువ స్టార్ లు వున గృహెూపక పరికరాలు వాడకం తదితర వాటి గురించి ప్రజలకు తెలియచేసి విద్యుత్ ను పొదుపుగా వాడే విధంగా ప్రజలకు ఈ వారోత్సవాల్లో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భావి తరాలకు విద్యుత్ కొరత లేకుండా చూకోవాల్సిన భాధ్యత మనందరి పైన ఉందని అన్నారు. జిల్లాలో సూర్య భగవానుడు కొలువున్నాడని ఆ శక్తిని మనం ఇంధనంగా వినియోగించు కోవడానికి మన జిల్లా ముందుండాలన్నారు. జిల్లా కలెక్టర్ జండా ఊపి ర్యాలీ ప్రారబించారు. విద్యుత్ పొదుపు చేద్దాం ధనం ఆదాచేద్దాం, సేవ్ పవర్సేవ్ నేషన్, విద్యుత్ విలువైనది వృధా కాకుండా కాపాడుదాం అనే నినాదాలతో ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఇంధన పొదుపు ప్రచార పోస్టర్ విడుదలచేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారితో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఎస్పిడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణ మూర్తి, ఈఈ లు సత్తారు బైరి నాయుడు, ఈ ఈ టెక్నికల్ ఎల్ సి హెచ్ పాత్రుడు, ఎస్ ఎ ఓ పి తాతా చార్యులు, దడి ఈ సుదర్శన రావు, ఏడి పైడి యోగేశ్వరరావు, ఎ ఈ లు కమల్ హాసన్, సురేష్, వివిధ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దానేటికి టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు

విశాలాంధ్ర-అరసవల్లి: సంతానలేమితో బాధపడే ఎందరో మహిళలకు ఐవీఎఫ్ వైద్య విధానం ద్వారా మాతత్వపు మధురిమలు పంచుతూ ఆయా జంటల కలలను సాకారం చేస్తున్న ప్రముఖ గైనిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్‌కు టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. ఈఅవార్డును శుక్రవారం హైదరాబాద్ నగరంలోని హెూటల్ పార్క్ హ్యాట్‌లో జరిగిన టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు ఐకాన్ ఇన్ ఐవీఎఫ్ ట్రీట్మెంట్ ఇన్ రూరల్ ఏరియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్-2023కు సంబంధించి ఈ అవార్డును ప్రముఖ బాలీవుడ్ యాక్టర్ అనిల్ కపూర్ డాక్టర్ దానేటి శ్రీధర్‌కు అందజేశారు. దానేటి శ్రీధర్‌కు టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు వరించడంపట్ల జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యులు, పలువురు ప్రముఖులు, మెడికవర్, దానేటి శ్రీధర్ ఆసుపత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

పార్టీ కార్యాలయంలేని అధికార పార్టీ వైకాపా

- అన్ని హంగులతో టిడిపి పార్టీ కార్యాలయం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: పార్టీకి పట్టు కొమ్మలు కార్యకర్తలు అలాంటి కార్యకర్తలకు అండగా ఉండడానికి, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రతి పార్టీ ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అనవాయితీ ద్వారా పార్టీ మనుగడకు, కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల ద్వారా సలహాలు సంప్రదింపులు సమావేశాలు నిర్వహిస్తూ పార్టీని ముందుకు నడిపిస్తూ ఉంటారు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీ నేతలయితే ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓ సంవత్సరం ముందుగా పార్టీ కార్యాలయం అన్ని హంగులతో ఏర్పాటు చేసుకున్నారు. ఇక అధికార పక్షం ఎవరైనా పార్టీ కార్యాలయం ఏర్పాటుతో పాటు వారికి అధనంగా మండల పరిషత్ విశ్రాంతి భవనం ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అధికార పార్టీ అయన వైకాపాకు కార్యాలయం లేకపోవడం వేశేషం. టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీని కలవాలంటే వారి ఇంటికి వెళ్ళి కాలవాల్సి ఉంటుంది. పార్టీ కార్యాలయం లేకపోవడంతో ఆ పార్టీలో పలువురు ఇంటి వద్దకు వెళ్ళి కలవడానికి వెనుకడుగు వేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇక ప్రతి పక్ష టిడిపి పార్టీ కార్యాలయం ఏర్పాటులోనూ ప్రజలతో మమేకం కావడంలోనూ చొచ్చుకొని పోతున్నారు. గత ఎన్నికలలో టెక్కలి నియోజక వర్గం నుంచి వైకాపానుంచి పోటీ చేసిన పేరాడ తిలక్ కోటబొమ్మాళి మండలంలో ఎన్నికలు సంవత్సరం ముందు పార్టీ కార్యాలయంను ప్రారంభించి గ్రామ, గ్రామాల్లో పర్యటిస్తూ ఉండి మండల కార్యకర్తలకు పార్టీ కార్యాలయంలో కలుసుకొని మాట్లాడేవారు. ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత అయనకు వైకాపా అధిష్టానం కళింగ కార్పోరేషన్ పదవిని కట్టబెట్టి టెక్కలి నియోజకవర్గ బాధ్యతలను తప్పించారు. దీంతో కోటబొమ్మాళిలో వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం తీసేశారు. తరువాత టెక్కలి బాధ్యతలు దువ్వాడ శ్రీనివాస్‌కు అప్పజెప్పి ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టి పార్టీ కార్యక్రమాలు ఆయన నిర్వహించాను. అనంతరం దువ్వాడ వాణికు పార్టీ నియోజకవర్గం బాధ్యాతలు అప్పజెప్పారు. ప్రస్తుతం అధికార పార్టీలో ఎదురవుతున్న వింత ధోరణలు నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పార్టీ మరింత బలపడే అవకాశం ఉన్నట్లు ఆ పార్టీ శ్రేణులు బలంగా విశ్వసిస్తున్నారు. ఇక అధికార పార్టీకి పార్టీ కార్యాలయం లేదంటే ఇక్కడ కార్యకర్తల మనుగడ ఏ మాత్రం ఉందో అర్థం అవుతుందని పలువురు మేధావులు నెమరు వేసుకుంటున్నారు.

హామీలు అమలుచేయమంటే బెదిరింపులా...?

- మొండి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు
- 4వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు దిగినా బెదరకుండా అంగన్‌వాడీల సమ్మెను కొనసాగిస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి దుప్పల గోవిందరావు స్పష్టం చేశారు. వేతన పెంపు, గ్రాట్యూటీ, బకాయి సెంటర్ల అద్దెలు, టీఏ, డీఏలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్‌ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 4వ రోజు కొనసాగింది. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా జరుగుతున్న సమ్మెదీక్షలు కార్యక్రమంలో సిఐటియు టెక్కలి డివిజన్ ఇన్‌చార్జీ హనుమంతు ఈశ్వరరావు, యుటీఎఫ్ జిల్లా నాయకులు గొండు నారాయణరావు, సామ సంజీవరావులు పాల్గొని అంగన్‌వాటీలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం నేత దుంపల సుదర్శన మాట్లాడుతూ ఎన్నికల్లో

ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతున్నా మని, తమ డిమాండ్లు న్యాయమైనవని, చాలా సార్లు విజ్ఞాపనలు ఇచ్చినా పరిష్కరించకపోవడంతో విసిగిపోయి సమ్మెలోకి దిగామని, ఇలాంటి పరిస్థితుల్లో సమస్యలపై చర్యలు జరిపి పరిష్క రించాల్సింది పోయి ప్రభుత్వం అధికారుల చేత బెదిరింపులకు పాల్పడడం సరికాదని అంగన్వాడీ లు తెలిపారు. బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తాళాలను పగల గొట్టాలని చూడడం దుర్మార్గమైన చర్యయని, ఇలాంటి మొండి ప్రభుత్వా నికి గుణపాఠం తప్పదని అంగన్వాడీ కార్యకర్తలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గోవింద రావు మాట్లాడుతూ అక్కా చెల్లెమ్మలు కష్టాలు తీరుస్తామంటూ గొప్పలు చెప్పే సిఎం జగన్‌కి అంగన్‌వాడీలు రోడ్లపై చేస్తున్న అందోళనలు కనిపించడం లేదా అంటు ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరసనలు తెలిపే హక్కును కూడా వైసిపి ప్రభుత్వం హరిస్తోందన్నారు. ధర్నాలు చేయనికుండా పోలీసులతో అడ్డుకునే సంస్కృతి తీసుకురావడం విచారకమన్నారు. అంగన్వాడీ వరక్కర్లు చేపట్టిన సమ్మెను అణిచివేయాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పతనం తప్పదని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

కిడ్నీ ఆసుపత్రి నిర్మాణంలో సి.ఎం ప్రమేయం ఏమీ లేదు..?

రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వజ్జ బాబురావు

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 200 పడకల ఆసుపత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రం, రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన సుజల స్రవంతి పథకం ఏర్పాటులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రమేయం ఏమీ లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, జనసేన నియోజకవర్గం ఇంచార్జి డాక్టర్ వి దుర్గారావు అన్నారు. శుక్రవారం పలాస ప్రభుత్వ ఆసుపత్రిని టిడిపి, జనసేన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సుజల ధార పథకం క్రింద రూ. 1900 కోట్లు మంజూరు చేస్తే మొదటి విడతగా ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, ఆయా ప్రాంతాలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ. 468 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కిడ్నీ వ్యాధులతో ప్రజలు బాధలు పడుతున్నారని, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఒత్తిడి తీసుకు వస్తే 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కిడ్నీ ఆసుపత్రి ఏర్పాటుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కిడ్నీ ఆసుపత్రి నిర్మాణం కోసం 4.50 ఎకరాలు స్థలాన్ని కేటాయించింది అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ అని సిఎం, మంత్రి సీదిరి అప్పలరాజులు తెలుసుకోవాలన్నారు. కిడ్నీ రోగుల పట్ల నాలుగేళ్ళు ఏమైనా చేసామని చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. కిడ్నీ రోగులకు తాగునీరు అందించేందుకు ఎన్టీఆర్ సుజల ధార పథకం ద్వారా రూ. 2 లకు 20 లీటర్లు ఇచ్చేందుకు రూ. 17 కోట్లు వ్యయంతో 75 యూనిట్లు ఏర్పాటు చేస్తే వైసిపి ప్రభుత్వం వాటిని మూసివేసే స్థితికి తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిడ్నీ ఆసుపత్రి, వైయస్సార్ సుజల స్రవంతి పథకాలకు వైయస్సార్ నామకరణం ఏలా చేస్తారంటూ ప్రశ్నించారు. ఆ పథకాలకు వైసిపికు ఏమైనా సంబంధం ఉందా....? వైయస్సార్ సుజల స్రవంతి పథకం ఏర్పాటులో ప్రభుత్వ భాగస్వామ్యంతో ఎంతో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. టిడిపి హయాంలో కిడ్నీ వ్యాధి పై పరిశోధన చేసేందుకు లక్ష 25 వేల మందికి రక్తపరీక్షలు చేసి సర్వే చేయడం జరిగిందని, 27 రకాల మందులు రోగులకు పంపిణీ చేశామ న్నారు. వైసిపి ప్రభుత్వంలో నాలుగేళ్ళలో ఒక్కరికైనా ఉచితంగా మందులు పంపిణీ చేశారా అని ప్రశ్నించారు. మీ హయాంలో కిడ్నీ రోగుల కోసం అదనంగా ఎందుకు డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయలేకపోయారన్నారు. తాము శంకుస్థాపన చేసి కిడ్నీ ఆసుపత్రి ప్రారంభం చేశామని గొప్పలు చెప్పుకొంటున్న మీరు టిడిపి హయాంలో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ పరికరాలు రీసెర్చ్ సెంటర్ కు తరలించడం సిగ్గు చేటని పేర్కొన్నారు. త్రాగునీరు సాగు నీరుకు మూలమైన ఆఫ్ షోర్ రిజర్వాయర్ ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. పలాస నియోజకవర్గంలో కొండలు గుట్టలు మింగేస్తున్నా మంత్రి సీదిరి అప్పలరాజులు టిడిపి పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్ రావు,రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, పలాస మండల టిడిపి అధ్యక్షుడు లక్ష్మణ కుమార్, దువ్వాడ సంతోష్, గురిటి సూర్యనారాయణ, తలగాన నరసింహ పాల్గొన్నారు.

మాత శిశువు సంరక్షణ శిక్షణ

విశాలాంధ్ర-పలాస : హైదరాబాద్ అరబిందో కార్యాలయంలో ఈ నెల 7నుంచి 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం అరబిందో అత్యవసర మెడికల్ సర్వీసస్ 108 సౌజన్యంతో లండన్‌కు చెందిన సాంకేతిక భాగస్వామ్యులు వైద్య బృందంతో 108 సంస్థలో పని చేసే వోజెటిలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. మాత శిశువు సంరక్షణ కీలక సమయంలో సహాయ పడడంలో అంబులెన్సులో పని చేసే ఈఎంటిలకు డాక్టర్ సునీల్‌బాబు, పరుశురాం, మహిపాల్‌లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ నుంచి 16 మంది వోజీటిలు హాజరు కాగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి కోటబొమ్మాళి నుంచి నెయ్యిల క్రిష్టారావు శిక్షణకు హాజరయ్యారు.

తపాలా శాఖ జిడిఎస్ డిమాండ్లను పరిష్కరించాలి

విశాలాంధ్ర-మెళియాపుట్టి: అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం జి.డి.ఎస్ (ఎన్.ఎఫ్.పి.ఇ) సిబ్బంది తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వారు పలు నినాదాలు చేశారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం జిడిఎస్ సిబ్బంది చేపడుతున్న దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగముగా రెండవరోజు శు క్రవారం మెళియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక తపాలా శాఖ కార్యాలయం వద్ద పలు నినాదాలు చేస్తూ కమలేష్చంద్ర కమిటీ సిఫార్సులలో అర్హులైన జిడిఎస్లకు సీనియారిటీ ప్రకారం వెయిటేజ్ కల్పిస్తూ 1.1.2016 నుండి జీతాలు ఇవ్వాలని, గ్రాట్యుటీని 5 లక్షలకు పెంచాలని, క్యాష్ లేస్ మెడికల్ ఫెసిలిటీస్ కల్పించాలని, కొత్తగా చేరిన జిడిఎస్ లందరికి రెండవ స్కేల్ యివ్వాలని,12, 24, 36 సంవత్సరాలకు 3 ప్రమోషన్లు కల్పించాలని కోరుతూనే ప్రభుత్వం స్పందించి మా ఈ డిమాండ్లను పరిష్కరించాలని, ఆర్.ఇ.సి.టి. మిషన్లకు బదులుగా లాప్టాప్, ప్రింటర్లు యివ్వాలని, టెక్నికల్గా వచ్చే సమస్యలను పరిష్కరించాలని, సబ్స్టిట్యూట్లకు జీతాలు సకాలంలో చెల్లించాలని వారు కోరుతున్నారు. బాణాపురం, శేఖరపురం, పెద్ద లక్ష్మీపురం, జాడుపల్లి, మెళియాపుట్టిలతో పాటు సిరియాకండి బ్రాంచ్ నుండి బాలకృష్ణ, మర్రిపాడు నుండి ఈశ్వరరావు, సురంగో, దీనబందుపురం నుండి రోహిణి, లక్ష్మి, మెళియాపుట్టి నుండి ఎస్. ఎం. పట్నాయక్, పెద్దలక్ష్మీపురం నుండి బి. శ్రీను, శేఖరాపురం నుండి జి. ధర్మారావు తదితరులున్నారు.

17న పలాస ప్రభుత్వ పింఛనుదారులు సమావేశం

విశాలాంధ్ర-పలాస : అఖిల భారత పింఛనుదారుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీ ఆదివారం కాశీబుగ్గ శ్రీకన్యాపరమేశ్వరి ఆలయం ఆవరణలో ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు తమ్మినాన మాధవరావు, కార్యదర్శి ఎన్.అప్పారావు లు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో 1200 మంది ప్రభుత్వ పింఛనుదారులు ఉన్నారని, ఈ సమావేశంలో వారి సమస్యలు చర్చిస్తామని తెలిపారు. 1 జూలై 1948 లోపు జన్మించిన 18 మంది పింఛనుదారులను ఘనంగా సన్మానిస్తా మని, ఈ సమావేశానికి పింఛనుదారులందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గర్ల్స్ హైస్కూల్ మంజూరుకు సీఎం జగన్ హామీ...

విశాలాంధ్ర-హిరమండలం : మండల కేంద్రమైన హిరమండలంలో (గర్ల్స్ హైస్కూల్) అమ్మాయిల ప్రాథమికొన్నత పాఠశాల మంజూరు నిమిత్తం రాష్ట్ర ముఖ్య మంత్రి వై ఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి ఆశీస్సులతో మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు అంద వరం వెంకట్ సురేష్‌లు విశాలాంధ్ర ప్రతినిధికి శుక్రవారం తెలియజేశారు. గురువారం జిల్లా లోని పలాసనియోజకవర్గ కేంద్రంలో కిడ్నీ రోగుల హాస్పిటల్ ప్రారంబోత్సవానికి సీఎం జగన్మోహనరెడ్డి వచ్చిన సందర్బంగా సీఎం ను కలిసి విన్నవించినట్లు మీసాల రామకృష్ణ తెలియ జేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిరమండలం హైస్కూల్‌లో 550 మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యని అభ్యసిస్తున్నా రని ఎబి రహదారికి పాఠశాల అనుకోని ఉందని రహదారి పైనే గందరగోళం గా మార్కెట్ కూడా ఉండడం వలన ముఖ్యంగా అమ్మాయిలు చదువు కోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపామన్నారు. గర్ల్స్ హై స్కూల్ మంజూరు కు హామీ పట్ల సీఎం జగన్మోహన్ రెడ్డి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారిచేశారని కొనియాడారు. ఈ సందర్భంగా సీఎం జగనన్న కు, స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి కి, వైస్సార్సీపీ నాయకులు మీసాల రామకృష్ణ, ఎవి సురేష్ కు విద్యార్థునిలు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వివరించారు.

అంగన్వాడీలకు తేదేపా సంఘీభావం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : సమస్యల పరిష్కారం కోరుతు నిరసన బాట పట్టిన అంగన్వాడీ కార్యకర్తల దీక్షలు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక తెలుగుదేశం పార్టీ క్యాడర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసారని, మరలా రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని, అంగన్వాడీ వర్కలు సహాయ పడాలని, తిరిగి అంగన్వాడీ కేంద్రాలకు పూర్వ వైభవం తెచ్చి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు పడతాయని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీసం 26వేల రూపాయల వేతనాన్ని అందివ్వాలని, అంగన్వాడీ కేంద్రాల పరిధిలో లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సరఫరా చేయించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి నినాదాలు చేసారు. కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ అసోసియేషన్ ప్రతినిధులు హైమావతి, విజయ, బాల, సుబ్బలక్ష్మి, సురేఖ, సరస్వతి, జయలక్ష్మి, కోమలి తదితరులు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ మహిళా కార్యదర్శి ఆశి లీలారాణి, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు దక్కత శ్రీను, కామేష్, మాజీ ఎమ్పీపి దక్కత డిల్లీరావు, పాడి సహదేవ్, లోపింటి పద్మనాభం, సాడి డిల్లీరావులు హాజరై సంఘీభావం తెలిపారు.

ప్రాథమిక స్థాయి నుంచే సైన్సుపై అవగాహన పెంచుకోవాలి

- ఎంఈవోలు అప్పలరాజు, ఎల్‌వి ప్రతాప్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే సైన్సు పై అవగాహన పెంచుకోవాలని స్థానిక మండల విద్యాశాఖాధి కారులు సంపతిరావు అప్పలరాజు, ఎల్‌వి. ప్రతాప్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మండలంలోగల 10 పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల సైన్సు ఎగ్జిబిషన్‌లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన చేసిన మూడు పాఠశాలలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అయితే ఇందులో ప్రథమ స్థానం లఖందిడ్డి, ద్వితీయ స్థానం కురుడు, తృతీయ స్థానం కోటబొమ్మాళి జిల్లా పరిషత్ పాఠశాలలు సాధించిగా, మొదటి రెండు స్థానాలలో గెలుపొందిన వారు ఈనెల 20వ తేదీన శ్రీకాకుళం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు హాజరు కావాలని దీనికి అద్యక్షత వహించిన ఆర్.విజయలక్ష్మి విద్యార్థులను సూచించారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు బి. యర్రన్నాయుడు, కె. ఆనందరావు, సోమ శేఖర్, హైమావతి, అరుణకుమార్, సామ సంజీవరావు పాల్గొన్నారు.

హరేరామ అఖండ నామసంకీర్తనలో పాల్గొన్న డా.ధర్మాన

విశాలాంధ్ర-నరసన్నపేట: పట్టణంలో జట్టు కళాసీ యూనియన్ ఆఫీస్ ఆవరణలో జై జగన్నాథ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరే రామ హరే కృష్ణ అఖండ నామ సంకీర్తన కార్యక్రమంలో శుక్రవారం నియోజకవర్గ యువ నాయకులు, పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య పాల్గొన్నారు. ఈ సంధర్భంగా స్వామివారిని డా.కృష్ణచైతన్య దర్శించుకొని, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం ఇలాంటి దైవ కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, వైసిపి నాయకులు, చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, రాజాపు అప్పన్న, పెరుమాళ్ళ తవిటినాయుడు, కణితి కృష్ణారావు, బొబ్బాది ఈశ్వరరావు, బుద్ధల రాజశేఖర్, నేతింటి రాజేశ్వరరావు, కనపల అరవింద్, కోటిపల్లి శ్రీనివాసరావు, మానెం శివ, రావాడ రామారావు, జగన్నాథ కమిటీ ప్రతినిధులు, బెహరా సన్యాశి, సోమేశ్వరరావు, బృందావనం తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు సిబ్బంది నిరసన

విశాలాంధ్ర-పలాస : అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (జిడిఎస్) ఇచ్చిన నిరావదిక సమ్మె పిలుపు మేరకు ఆ సంఘం జిల్లా కార్యదర్శి నందికేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం కాశీబుగ్గ పోస్టాఫీసు ఎదుట నిరసన దీక్ష చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవకులకు సీనియార్టీ ప్రాతిపదికన వెయిటేజ్ కల్పిస్తూ 1 జనవరి 2018 నుంచి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రాట్యూటీ 5 లక్షల రూపాయలు పెంచాలన్న న్యాయసమ్మతమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, నగదు రహిత వైద్య సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు 3 పదోన్నతులు కల్పించాలని, కొత్తగా చేరిన జీడిఎస్‌లకు 2వ స్కేల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రకాశరావు, యర్రన్నకుమార్, సురేష్, సింహాచలం, చరణ్‌లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో సత్తాచాటిన మందస విద్యార్థులు

విశాలాంధ్ర-మందస : జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కారించుకొని సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా గణిత ప్రతిభ పరీక్షల్లో 9వ తరగతి విభాగానికి సంబంధించి సొండిపూడి ఉన్నత పాఠశాల విద్యార్థిని బాడ శ్రీజ 4వ ర్యాంక్, కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని పైల కీర్తన 6వ ర్యాంక్, పొత్తంగి, సిరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని కొండపల్లి దీపిక 7వ ర్యాంక్, అలాగే

పదో తరగతి విభాగంలో మందస ఉన్నత పాఠశాల విద్యార్థిని వడ్డి లాస్యప్రియ జిల్లా స్థాయిలో 8వ ర్యాంక్ సాధించి మందస మండలానికి వన్నె తెచ్చారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్‌రాజ్, ఎస్.గణేశ్వరరావు, ఎన్.తారకేశ్వరరావు, జె.రవికుమార్, గణిత ఉపాధ్యాయ వేదిక మందస మండల ప్రతినిధులు గవ్వ భీమారావు, వి.మురళీలు అభినందనలు తెలియజేశారు. విజేతలైన విద్యార్థులకు ఈ నెల 17న శ్రీకాకుళంలో జరిగే జిల్లా స్థాయి గణిత దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రధానం చేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

సహాయానికి ముఖ్యమంత్రి సుముఖత

ప్రమాద బాధితునికి పెరిగిన ఆత్మస్థైర్యం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణానికి కదంబాల మోహనరావు అనే ఆర్టీసీ కండక్టర్ కొన్ని నెలల క్రితం బస్సు ప్రమాద ఘటనలో తన రెండు కాళ్లు పోగొట్టుకున్నారు. ఓ చిరుద్యోగి విశాఖలో గల ఒక ప్రైవేటు ఆసువత్రిలో ఇప్పటికీ చికిత్స పొందుతూనే ఉన్నారు. పెద్దమొత్తంలో ఆసుపత్రికి అయిన ఖర్చులను భరించలేక అప్పులపాలై ఆందోళన చెందుతున్న పరిస్థితుల్లో గురువారం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవానికి పలాస వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసేందుకు బాధితుడు మోహనరావు అతికష్టం మీద పలాసలో జరుగుతున్న సభా స్థలానికి చేరుకున్నారు. గమనించిన ముఖ్యమంత్రి తన సిబ్బందితో పిలిపించుకుని మోహనరావుకు సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే అతనికి అన్ని విధాలా సహాయక చర్యలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రి ఖర్చులను చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చూపిన సానుభూతిని ఎన్నటికి మర్చిపోలేమని మోహనరావు కుటుంబీకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి దయతలచి తమ కుటుంబాన్ని త్వరగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ భీమా తక్షణ సాయం పంపిణీ

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి మండలం మకరాంపురం పంచాయతీ జన్నిపుట్టుగ గ్రామంలో ఎంపీపీ పైల దేవదాసురెడ్డి, జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, వైసీపీ మండల కన్వీనర్ వజ్జ మృత్యుంజయం శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణ సహాయం 10వేల రూపాయలను బాధితులకు అంద జేశారు. పొట్టి ఢిల్లేశ్వరరావు అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భార్య పొట్టి గీతకు ఈ సహాయం అందజేశారు. మిగతా మొత్తం నామిని బ్యాంక్ అకౌంట్‌కు జమ అవుతుందని తెలిపారు. అలాగే కుంబరినౌగాం పంచాయతీలో సవర బాలిగాం గ్రామంలో ఇటీవల మృతి చెందిన సోనియా దాండియా కుటుంబానికి కూడా వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద పది వేల రూపాయలను నామిని శశి దాండియాకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రాందాసు, లడుకేశవపాత్రో, ఇప్పిలి కృష్ణారావు, సర్పంచ్ హరిబందు జన్ని, ఎంపీటీసీ ఎలుసూరి అప్పారావు, తమరాల కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

దేశానికే జగన్ ఆదర్శం

విశాలాంధ్ర-పలాస : దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని పరిపాలన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసి చూపిస్తున్నారని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకట్రావు చిట్టి అన్నారు. మండలంలోని రెంటికోట గ్రామంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో మంజూరు చేసిన పథకాలు, నిధుల వివరాల ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్ రమేష్ నాయుడు, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠ రావు, సర్పంచ్ శాసనపురి తిరుమలరావు, మండల సచివాలయం కన్వీనర్ దువ్వాడ రవి కుమార్, పంచాయితీ కార్యదర్శి సద్గుణ బాబు పాల్గొన్నారు.

సిఎం పర్యటన విజయవంతం

విశాలాంధ్ర-పలాస : పలాసలో రూ.85 కోట్లతో 200 పడకల ఆసుపత్రి మరియు కిడ్నీ పరిశోధన కేంద్రం, రూ.700 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన వైయస్సార్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికు ఘనంగా స్వాగతం పలికి బహిరంగ సభ విజయవంతం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం పలాస మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం పర్యటనకు అనుకున్న దాని కంటే ఎక్కువ మంది వచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన ప్రవీణ్‌కుమార్

విశాలాంధ్ర-నరసన్నపేట : యువగళం పాదయాత్రలో భాగంగా శుక్రవారం యలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్‌ను నరసన్నపేట జనసేన మండల అధ్యక్షులు, బలగ ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా ప్రవీణ్‌కుమార్‌తో లోకేష్ మాట్లాడుతూ టిడిపి, జనసేన పార్టీలను బలోపేతం చేసే విధంగా, కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని అన్నారని తెలిపారు.

'కనపల'ను పరామర్శించిన డా.కృష్ణచైతన్య

విశాలాంధ్ర-నరసన్నపేట : సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు, మాజీ ఎంపిటిసి, కనపల శేఖర్‌రావుకు శుక్రవారం పోతయ్య వలస గ్రామంలోని ఆయన నివాసగృహంలో పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య పరామర్శించారు. ఇటీవల శేఖర్‌రావు కాలుకు శస్త్ర చికిత్స జరిగిందనే విషయాన్ని తెలుసుకున్న చైతన్య పరామర్శించి, ఆయన ఆరోగ్యంపట్ల ఆరా తీసారు. ఈ కార్య క్రమంలో వైసిపి నాయకులు, ముద్దాడ బైరాగి నాయుడు, కణితి కృష్ణారావు, రెంటికోట త్రినాథ రావు, బొబ్బాది ఈశ్వరరావు, తోట అప్పారావు, కనపల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

శ్రీ చౌడేశ్వరి చేనేత సహకార సంఘం విజ్ఞప్తి

విశాలాంధ్ర-నరసన్నపేట: నియోజకవర్గంలో అర్హులైన చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలని శ్రీ చౌడేశ్వరి చేనేత సహకార సంఘం ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్‌కు, పోలాకి జెడ్పిటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్యకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మబగాం క్యాంపు కార్యాలయంలో చేనేత సంఘం ప్రతినిధులు, వట్టి గణేష్, మానెం శివ కృష్ణదాస్‌తో మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన చేనేత కార్మికుల పేర్లను విజ్ఞాపనపత్రంలో పేర్కొన్నామని, వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛన్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వంటా, వార్పు చేస్తూ పోస్టల్ సిబ్బంది నిరసన

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వంటవార్పు చేస్తూ స్థానిక పోస్టల్ కార్యాలయం వద్ద శుక్రవారం నాల్గువ రోజు ధర్మానకు దిగారు. డాక్ సేవక్ లకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, గ్రామాల్లో పనిచేసే వారికి 8 గంటలు పని విధానం అలాగే మరో ఐదు డిమాండ్ల పరిష్కరించాలన్నారు. డాక్ సేవక్‌ల సమ్మెతో గ్రామాల్లో తపాలా సేవలు నిలిచి పోయాయి. ఈ నిరసన కార్యక్రమంలో కోటబొమ్మాళి పోస్టల్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు, గ్రామీణ డాక్ సేవక్‌లు పాల్గొన్నారు.

అధినేత జగన్‌తో కొత్తూరు వైసీపీ నేత ఆనంద్

విశాలాంధ్ర-కొత్తూరు : పలాస పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైసీపీ నాయుకులు సచివాలయాల. పార్టీ కన్వీనర్‌ల మండల సమన్వయకర్త గండివలస ఆనందరావు కలిశారు. ఎప్పటినుండో పెండింగ్‌లో ఉన్న కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చెయ్యాలని తాను సీఎం జగన్ మోహన్ రెడ్డిని కోరినట్లు ఇక్కడ మీడియాకు వైసీపీ నాయుకులు ఆనంద్ తెలిపారు ఈ సమయంలో పక్కనే ఉన్న కలెక్టర్ శ్రికేష్ లాఠకర్‌కు కొత్తూరులో డిగ్రీ కళాశాల అభ్యర్థన పరిశీలించాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి సూచించినట్లు ఆనంద్ తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలపై ప్రభుత్వ వైఖరి విడనాడాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు

విశాలాంధ్ర-కాశీబుగ్గ : న్యాయమైన డిమాండ్ల కోసం కొద్ది రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరసన మద్దతుగా శుక్రవారం పలాస టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బాబురావు మాట్లాడుతూ న్యాయపరమైన అంగన్వాడీ కార్యకర్తలు డిమెండ్లు ప్రభుత్వం అంగీకరించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. 20వ తేదీన యువగళం సభలో చంద్రబాబుకు అంగన్వాడీ సమస్యలు వివరిస్తాం అని తెలియజేశారు. మరో మూడు నెలల్లో టిడిపి ప్రభుత్వం రాబోతుందని అంగన్వాడీ సిబ్బంది డిమాండ్ల పరిష్కారానికి కృషిచేస్తాం అని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికి హక్కులు కొరకు పోరాడే స్వేచ్ఛ ఉందని, అంగన్వాడి సిబ్బంది సేవలు ప్రశంస నేయమని పేర్కొన్నారు. సమయానికి జీతాలు అడగటం న్యాయపరమైన డిమాండ్ అని వాటిని నెరవేర్చే బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం టిడిపి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్ రావు మాట్లాడుతూ రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో మీ డిమాండ్లను పరిష్కారం దిశగా ఆలోచిస్తామని, అంగన్వాడి ఉద్యమానికి టిడిపి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలియజేశారు. గతంలో టిడిపి ప్రభుత్వంలో అంగన్వాడి సిబ్బందికి న్యాయం జరిగిందని, తమ హక్కుల కొరకు పోరాడుతున్న ఈ ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమని పేర్కొన్నారు, అంగన్వాడి కేంద్రాలు వాలంటీర్ లతో పగలగొట్టడం ఈ ప్రభుత్వ ఆదికార అహంకారానికి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో పలాస మండల అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, కుర్మా రావు, పలాస తెలుగుయువత అధ్యక్షుడు డిల్లిరావు, ఐటీడిపి నియోజకవర్గ అధ్యక్షుడు ధనుంజయ రావు, హెూరియా మోహనరావు, జొగ మల్లి, అవుగాన షణ్ముఖరావు మొదలైన వారు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను తెరిచి సేవలందించాలి

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న అంగన్వాడి కేంద్రాలను తెరిచి పిల్లలు, గర్భిణీ స్త్రీలకు సేవలు అందించాలని మున్సిపల్ కమీషనర్ టీ.నాగేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు సమ్మె బాట పట్టడంతో అంగన్వాడి పిల్లలు గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం అందించలేక పోతున్నామని, ప్రభుత్వం ఆదేశాల మేరకు సచివాలయ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తాళాలు బద్దలు కొట్టి తెరిచి సేవలు అందించాలన్నారు. పిల్లలకు అంగన్వాడి కార్యకర్తగా సచివాలయ ఉద్యోగులు, ఆయాలుగా వారంటీలను నియమించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి పిల్లలకు భోజనం ఎలా పెట్టాలి, పౌష్టిక ఆహారం ఎలా పంపిణీ చేయాలనే విషయాన్ని సచివాలయ ఉద్యోగులకు వివరించారు. సమావేశంలో కాశిబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ పాల్గొన్నారు.

వైకాపా ప్రభుత్వంతోనే గ్రామాలభివృద్ధి

టెక్కలి నియోజకవర్గం వైకాపా ఇన్చార్జ్ దువ్వాడ వాణి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : వైకాపా ప్రభుత్వంతోనే గ్రామాలు సంపూర్ణ స్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయని టెక్కలి నియోజకవర్గం వైకాపా పార్టీ ఇంచార్జ్ దువ్వాడ వాణి అన్నారు. శుక్రవారం ఉమిలాడ పంచాయతీలో స్థానిక సర్పంచ్ కిల్లి లక్ష్మి అధ్యక్షతన ఈ రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఇప్పటికే మారుమూల గ్రామాల్లో సైతం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువలో తెచ్చారని, వాలంటీర్ల వ్యవస్థతో ప్రజల ఇంటి దగ్గరకు ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయని ఆమె అన్నారు. అంతకుముందు సచివాలయం వద్ద వైకాపా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీలో ప్రభుత్వపరంగా లబ్ధిపొందిన లబ్ధిదారులు జాబితా బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంతబొమ్మాళి మండలం ఎంపీపీ మెరుగు రాజేశ్వరి అప్పారావు, సంతబొమ్మాళి మండలం కిల్లి జగన్ నాయకులు (గోవిందరావు), రుంకు హనుమంతుపురం పంచాయితీ సర్పంచ్ ఎన్ని మనమధరావు, పిఏసిఎస్ డైరెక్టర్ మార్పు నాగభూషణరావు. వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే టిడిపి పగటి వేషాలు - ఎంపీపీ ఉమామల్లేశ్వరరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ఎన్నికలు వస్తున్నాయని తెలిసే టిడిపి, జనసేన పగటి వేషాగాళ్ల మాదిరిగా జనం వద్దకు వస్తున్నారని మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమా మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలం విశ్వనాధపురం సచివాలయం నందు వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2019లో ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెలవేర్చిన మన జగనన్న పాలన గురించి ప్రతి గడపలో తెలియజేయడమే వైఏపీనీడ్స్ జగన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ముందుగా లబ్ధిదారుల సమాచార పట్టిక (డిస్ప్లే)ను ఆవిష్కరించిన అనంతరం వైయస్సార్సీపి జెండాను మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజుతో కలిసి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పొరపాటున చంద్రబాబు వస్తే 75 శాతం సంక్షేమ పథకాలు ఆగిపోతాయని, అందుకే ప్రజలంతా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలు మీ ఇంటికి తీసుకువస్తున్న జగనన్న ప్రభుత్వానికి ఓటువేసి జగన్మోహన్‌రెడ్డిని మళ్లి ముఖ్యమంత్రిని చేద్దామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, జేఎస్‌సీ కన్వీనర్ గద్దవలస నాగభూషణరావు, స్థానిక సర్పంచ్ పంతు ప్రభావతి, వైకాపా నాయకులు పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, కోతి చిన్నారావు, నేతింటి సింహాచలం, సింగుపురం వినోద్, హనుమంతు తేజ,యంఎల్‌వో తారక్ తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించిన జడ్పిటిసి వసంతరెడ్డి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : వర్షాభావ పరిస్థితుల వల్ల, వంశధార నీరు సకాలంలో రాకపోవడం వల్ల సంతబొమ్మాళి మండలంలో పంటలు పండకపోవటం వలన, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సంతబొమ్మాళి మండలం జడ్పిటిసి పాల వసంత రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈనెల 14న పలాస నియోజకవర్గంలో కిడ్నీ ఆసుపత్రి, సుజల ద్వారా వంటి ప్రాజెక్టులను ప్రారంభించిన ముఖ్యమంత్రిని కలిసి పత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. అలాగే ఇటీవల తుఫాను కారణంగా ప్రభావానికి గురై పండిన పంటలు కొంత నష్టం జరిగిందని ముఖ్యమంత్రి సమర్పించిన వినతిపత్రంలో వసంతరెడ్డి పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన అనంతరం ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని వసంత రెడ్డి తెలిపారు.

సంతబొమ్మాళి విద్యార్థులు జిల్లా స్థాయి ప్రతిభ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు జిల్లా గణిత శాస్త్రం ప్రతిభా పోటీ పరీక్షల్లో ప్రతభ కనపరిచారని, సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బరాటం కామరాజు తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్పోతాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు టాప్ టెన్ ర్యాంకులో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులతో పాటు, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

అంగన్వాడీల సమ్మెకు జనసేన మద్ధతు

విశాలాంధ్ర-ఆమదాలవలస : జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో అంగన్వాడి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని జనసేన ఆముదాల వలస ప్రతినిధి పేడాడ రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా జరుగుతున్న అంగన్వాడీల సమ్మెకు జనసేన పార్టీ శుక్రవారం మద్దతు తెలిపింది. హామీలకు ఐదేళ్లు కావస్తున్న ఏ ఒక్కటి నెరవేర్చక పోవడంతో అంగన్వాడీలో ఆందోళన. మాట్లా డు తూ అన్ని వర్గాల వారందరికీ పోషణ లోపం లేకుండా చూడటంలో అంగన్వాడీల పాత్ర ఎంతో కీలకమై నదని, అంతేకాకుండా ఒక స్త్రీ తన బిడ్డకు జన్మనివ్వడంతో ప్రారంభిస్తూ ఆ తల్లి, బిడ్డల సంరక్షణ ధ్యేయంగా ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా కాపాడుకుంటూ వస్తున్నారని అంగ న్వాడీల సేవలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని వారి న్యాయమైన కోర్కెలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశా రు. ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్మో హన్‌తో పాటు సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు వైడి మురళి మోహన్, గంగు కోటేష్, దువ్వాడ కరుణా సాగర, పప్పల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీపీ

విశాలాంధ్ర-జలుమూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ వాన గోపి అన్నారు. జలుమూరు మండలం జోనంకి సచివాలయం పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగునరేళ్లలో రూ. 18 కోట్లకుపైగా ఖర్చు చేసిందన్నారు. ఆ వివరాలు వెల్లడించే సమాచార పట్టికను సచివాలయం వద్ద ఆవిష్కరించారు.

పెద్దదూగాంలో 'మిషన్ ఇంద్రధనస్సు'

విశాలాంధ్ర-జలుమూరు : గ్రామీణ ప్రాంతాల్లో అర్హత గల ప్రతి ఒక్క చిన్నారికి వ్యాధి నిరోధక టీకా వేయాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన "మిషన్ ఇంద్రధనస్సు" టీకాల కార్యక్రమం, శుక్రవారం జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామంలో నిర్వహించారు. జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే నిర్వహించి చిన్నారులకు టీకాలు వేశారు. సచివాలయ సిహెచ్ సాయి, ఏఎన్ఎం సత్యవతి మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు కలెక్టర్, ఎస్పీ నివాళులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి పొట్టి శ్రీరాములు అమరజీవిగా మనందరి మదిలో చిరస్థాయిగా మిగిలారని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ కితాబిచ్చారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు 71వ వర్థంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి కలెక్టర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేషకృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం పనిచేసిన మహనీయుడు శ్రీరాములు అని తెలిపారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్న మహెూన్నతుడు అని, ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలు అర్పించిన ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన పేరుతో జిల్లా ఉండటం ఆయన త్యాగాలకు గుర్తుగా నిలుస్తాయన్నారు. అటువంటి మహనీయుడుని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలసిన తరుణమిదని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కుమార్, పలాస ఆర్.డి.ఓ భరత్ నాయక్, ఉప కలెక్టర్లు జయదేవి, బి పద్మావతి, జిల్లా బి. సి సంక్షేమ అధికారిణి అనురాధ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణలో కీలక పాత్ర పోషించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా ఆయన చిత్రా పటానికి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీతో పాటు ఆదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పులు వై.శృతి, సి హెచ్. జి.వి ప్రసాద్ రావు, బి.విజయకుమార్,కె . శ్రీనివాసాన్, ట్రైనీ డీఎస్పీ సి హెచ్ రాజా, సీఐ పి శ్రీనివాసరావు, ఆర్.ఐలు, డి.సురేష్ ఉమామహేశ్వ ఎస్.ఐలు, కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఖర్చులేని సత్వర న్యాయ పరిష్కారం కోసమే శాశ్వత లోక్‌అదాలత్

- శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి ఒక్క రూపాయి ఖర్చు లేని సత్వర న్యాయ పరిష్కారం కోసం "శాశ్వత లోక్ అదాలత్" ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని శ్రీకాకుళం జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి జ్ఞాన సువర్ణ రాజు అన్నారు. శుక్రవారం స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రజా ప్రయోజిత సేవలపై అవగాహన సదస్సులో సువర్ణ రాజు మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ ప్రజలకు ఎంతగా ఉపయోగపడుతుందో పలు ఉదాహరణలతో వివరించారు. ఎటువంటి సమస్య ఉన్నా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చు అన్నారు. సేవలు ఎలా ఉపయోగించు కోవాలో వివరించారు. "శాశ్వత లోక్ అదాలత్" అనే వ్యవస్థ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం కలిగివున్న వారందరికి ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయడమైన దన్నారు. అలాగే భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదని, దీని ద్వారా 10 రకాలైన ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించిన సేవలలో ఎలాంటి అవాంతరాలు, లోపాల వలన జరిగే నష్టాలకు సంబంధించి త్వరితగతిన న్యాయ పరిష్కారం పొందవచ్చన్నారు. ప్రజా ప్రాయోజిత సేవల్లో లోపం, పరిహారం కోసం దావా, సొమ్ము వసూలు, శాశ్వత లోక్ అదాలత్ యొక్క నినాదము, ప్రజా ప్రయోజిత సేవలలో లోపాలతో కలుగు నష్టాలపై వచ్చే ఫిర్యాదులకు సంబందిత ప్రజా ప్రాయోజిత శాఖల అధికారులు ఎలా స్పందించాలి, జాతీయ లోక్ అదాలత్ కు పర్మినెంట్ లోక్ అదాలత్ కు గలా వ్యత్యాసం తదితర అనేక అంశాలపై అవగాహన కల్పించారు. సాధారణ లోక్ ఆధాలత్ లో ఇప్పటికే ఎన్నో కేసులను పరిష్కారం చేయడం జరిగిందన్నారు. ఈ అవగాహనా కార్యక్రమంలో కళాశాల డీన్ కే. మురళీధర్, ఏవో కే.సత్య నారాయణ, అధ్యాపకులు ముకుంద రావు, అర్.కృష్ణ, బి శ్రీనివాసరావు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ ఆపన్న హస్తం...

- మానవత్వంతో ఆర్థిక సాయం అందించాలన్న ముఖ్యమంత్రి
- 8గురికి రూ. 9 లక్షలు ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరోసారి ఆపన్నులకు అండగా నిలిచారు. పలాసలో తన పర్యటనను ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఆయన పలువురు నుంచి వినతులు స్వీకరించారు. వివిధ అనారోగ్య కారణాలతో బాధ పడుతున్న వారికి మందులు, వైద్య, ఇతర అవసరాల కోసం వచ్చిన వినతుల పట్ల సానుకూలంగా స్పందించిన జగన్మోహన్ రెడ్డి బాధితుల పట్ల మానవత్వంతో స్పందించాలని ఉదారంగా ఆదుకోవాలని అక్కడే ఉన్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ను ఆదేశించారు. దీంతో జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో శుక్రవారం ఉదయం 8గురికి కలిపి రూ.9 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఆర్థిక సహాయం అందుకున్న వారిలో... పొందూరు మండలం నరసాపురం గ్రామానికి చెందిన బోను సంతోషి గత 10 సంవత్సరాల నుండి తేలికపాటి పక్షవాతం, తీవ్రమైన చర్మవ్యాధి ఉందని ఆర్థిక సాయం కోరడంతో ఆమెకు రూ.2.లక్షల సహాయం అందజేశారు. పెద్ద శ్రీపురం సచివాలయ పరిధికి చెందిన కిడ్నీ వ్యాధితో అనారోగ్యం పాలైన మేరపాటి తులసిదాసు నెలకు రూ.12,500 అవుతుందని ఆర్థిక సాయం కోసం కోరగా రూ.లక్ష అందజేశారు. వంశపారంపర్య హైపర్ కొలెస్ట్రిమియా అనే కిడ్నీ వ్యాధితో అనారోగ్యం పాలైన సనపల హేమంత్ కుమార్ ఆరోగ్యశ్రీ లో కూడా తనకు చికిత్స అందజేయాలని కోరగా తక్షణ సహాయంగా అతడికి రూ.లక్ష చెక్కును కలెక్టర్ అందజేశారు.రాజాం మండలానికి చెందిన అడపా యోగేశ్వరరావు గుండెలో రంధ్రాలు, జన్యుపరమైన సమస్యను ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్స జరిగిందని,ఆర్థిక సాయం కొరకు ముఖ్యమంత్రి కోరగా కలెక్టర్ రూ. 1లక్ష చెక్కును అందజేశారు. అలాగే వితిక (అధిక రక్తస్రావం) సాయికృష్ణ (మానసిక వ్యాధి) ఎం.సాత్విక్ (జన్యుపరమైన సమస్యలు, అధిక కొలెస్ట్రాల్) కొమర పోలరాజు (ఊపిరితిత్తుల క్యాన్సర్ 4వ దశ)లు వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రిని అభ్యర్థించగా వారి ఆదేశాలతో కలెక్టర్ లాఠకర్ అందరికి ఒక్కో రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి.ప్రకాశరావు, కొవ్వాడ ఎస్ డి సి తహసీల్దార్ బి.వి.రమణ, డి-సెక్షన్ సూపరింటెండెంట్ వి.అమల, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం రద్దు చేయాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: రాష్ట్రంలో రెవిన్యూ అధికారుల ఆధ్వర్యంలో ట్రిబ్యూనల్స్ ఏర్పాటు చేసి భూముల హక్కులు నిర్ధార్థించేస్తామనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడక తప్పదని న్యాయవాదులు ఉద్ఘాటించారు. భూమి హక్కుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలో ద్విచక్ర వాహనాల ర్యాలీని నిర్వహించారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ.ఏ.ఎల్) స్థానిక యూనిట్ , ఇచ్ఛాపురం న్యాయవాదుల సంఘం సంయుక్తంగా ఐ.ఏ.ఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజ్ పాత్రో సమన్వయంతో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్. దేవరాజు సమక్షంలో, నియోజకవర్గ మానవహక్కుల ఫెడరేషన్ అధ్యక్షులు దక్కత క్రిష్ణమూర్తి సహకారంతో జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ వద్ద నుండి మెయిన్‌రోడ్డు మీదుగా మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకుని అక్కడి నుండి దాసన్నపేట, రథంవీధి, పంజావీధి, ఆసుపత్రి రోడ్డు, బంగ్లారోడ్డు, చక్రపాణివీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, గొల్లవీధి, వి.కె.పేటల మీదుగా నినాదాలు చేసిన ర్యాలీతో తిరిగి కోర్టు వద్దకు చేరుకున్నారు. ప్రధాన కూడళ్ళ వద్ద ప్రజలతో మాట్లాడి చట్టం వల్ల ఎదురు కాబోయే సమస్యలను వివరించి, అవగాహన కల్పించారు. ఆర్.ఓ.ఆర్ చట్టం ఉండగా కొత్తగా జి.ఓ నెం. 512ద్వారా అక్రమంగా భూహక్కుల కోసం చట్టాన్ని చేసి రెవిన్యూ అధికారుల చేతుల్లో పెట్టడం ద్వారా పెత్తందార్లకు ఉపయోగపడుతుంది తప్పితే పేదలకు కాదని, న్యాయస్థానాలకు బదులు రెవిన్యూ అధికారులు యాజమాన్య హక్కులు నిర్ధారించే చట్టంతో బడుగు బలహీన వర్గాలు, పేదలు రైతులు తీవ్రమైన మానసిక ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సివస్తుందని, ప్రభుత్వ చర్య న్యాయస్థానాల ఉనికిని రూపుమాపడంగానే భావించాల్సి వస్తుందని నాగరాజ్ పాత్రో అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.ఎల్. నారాయణ, ఎన్.రమణయ్య, ఎం. రాంబాబు, బచ్చు జగ్గారావు, ఎన్వీఎన్ రంగారావు, భగవాన్ దాస్, పి. ప్రహ్లాద్, ఎం కె సామంత్, బి సూర్యనారాయణలు పాల్గొన్నారు.

టెక్కలిలో గెలిచి జగన్మోహన్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలి

- ఇన్చార్జ్ దువ్వాడ వాణి

విశాలాంధ్ర-టెక్కలి: స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో టెక్కలి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు కాయల వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గ కార్యకర్తలు అందరూ రానున్న ఎన్నికల దృష్టిలో ఉంచుకొని కలిసి పని చేయాలని అన్నారు.టెక్కలి నియోజకవర్గం ఇంచార్జీ దువ్వాడ వాణి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను టెక్కలిలో ఎగరవేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త గ్రామాలలో ప్రతి ఇంటికి జగనన్న ప్రభుత్వంలో మేలు జరిగిందని ఆ విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకుపోవాలని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు జగన్ ప్రభుత్వంలో లబ్ధి పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగు మండలాల పిఎసిఎస్ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు,సర్పంచులు, ఎంపీటీసీలు,మండల జెసిఎస్ కన్వీనర్లు, వివిధ హెూదాలగల డైరెక్టర్లు, గృహ సారధులు, వైయస్సార్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యువగలం పాదయాత్ర ముగింపు సభని విజయవంతం చేయండి

పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చిన ఎంజీఆర్

విశాలాంధ్ర-హిరమండలం : పాతపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో ఎంజీఆర్ నియోజకవర్గం పాతపట్నం కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంజీఆర్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగలం పాదయాత్ర ముగింపు సభ మరియు ఎన్నికల శంఖారావం సభకు అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పాతపట్నం నియోజవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మామిడి గోవిందరావు .. ఆయనతోపాటు పాతపట్నం టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, హిరమండలం టిడిపి మండల అధ్యక్షులు యాళ్ళ నాగేశ్వరరావు, ఎల్ ఎన్ పేట మాజీ టిడిపి మండల అధ్యక్షులు వెలమల గోవిందరావు, కొత్తూరు మాజీ టిడిపి మండల అధ్యక్షులు ఎద్దు దాసు నాయుడు, ఎల్ ఎన్ పేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాగాన మన్మధరావు, ఎల్ ఎన్ పేట టిడిపి ప్రధాన కార్యదర్శి కొవిలాపు కృష్ణమాచార్య, మెలియాపుట్టి మండల నాయకులు నంబాల వెంకట్రావు, కొత్తూరు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఆరుబోలు దశరధరావు, మాజీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ దుర్గాప్రసాద్ ,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంజీఆర్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1, 2 పోస్టులు పెంచాలి

- వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్నటువంటి రెండు లక్షల 30 వేల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ -1,2 ఉద్యోగాల సంఖ్యను పెంచి నియామక నోటిఫికేషన్ ఇవ్వాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నరసన్నపేట పట్టణంలో టిడిపి పార్టీ ఆఫీసులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఏళ్ల నుండి ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కోసం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనను తాము స్వాగతిస్తున్నామని. అయితే అభ్యర్థుల వయోపరిమితి మించిపోతున్నందున ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ లో వయోపరిమితుని 42 సంవత్సరాల నుండి 44 సంవత్సరాలకు పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ మరియు జూనియర్ కళాశాలల లెక్చరర్ పోస్టులకు ఏపీ సెట్ పరీక్షలను వెంటనే నిర్వహించాలని కోరారు. కేవలం ఎన్నికల ప్రచారం కోసం కాకుండా నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి అన్ని ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరు సంవత్సరాల నుండి డీఎస్సీ నోటిఫికేషన్ రాలేదని.... ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో భర్తీ చేస్తున్న అసిస్టెంట్. మరియు అసోసియేట్ ప్రొఫెసర్ నియమామకాలలో అవినీతి అక్రమాలకు తావు లేకుండా రోస్టర్ పద్ధతి ప్రకారం భక్తి కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సాంబశివరాజు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మెండ గౌరీ నాయుడు, రావాడ నరసింహులు, బొడ్డేపల్లి తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-జలుమూరు: స్థానిక ప్రభుత్వ కళాశాల జలుమూరులో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులచే ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు వాన గోపి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి 16 ఉన్నత పాఠశాలల నుండి సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత విభాగం నుంచి అల్లాడ ఉన్నత పాఠశాల వారు గ్రూపు విభాగము నుంచి శ్రీముఖలింగం ఉన్నత పాఠశాల వారు టీచర్స్ విభాగం నుంచి ఎలమంచిలి ఉన్నత పాఠశాల వారికి విజేతలుగా నిర్ణయించారు. వీరు 20వ తేదీన జిల్లా కేంద్రంలో జరగబోతున్న సైన్స్ ఎగ్జిబిషన్లో మండలం తరపున పాల్గొంటారన్నారు.

ముఖ్యమంత్రి హామీలు నెరవేర్చాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సి.ఐ.టి.యు జిల్లా ప్రతినిధి రమేష్ పట్నాయిక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించి, తమ సమస్యలు పరిష్కరించకుంటూ ఈ నెల 20 నుండి సమ్మె బాట పడతామని స్పష్టం చేసారు.

ఆశయాలు గొప్పగా ఉండాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : యువత ఉన్నత స్థానాలు చేరుకోవడానికి విద్యార్థి దశ నుంచే తగిన కృషి చేయాలని కొళిగాం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసుదేవరావు అన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ వర్ధంతిని శుక్రవారం పాఠశాలలో నిర్వహించి అతనికి ఘనంగా నివాళులు అర్పించారు. పాఠశాల విద్యార్థులు 'సర్దార్ ' అనే ఒడియా అక్షరాల రూపంలో కూర్చుని అంజలి ఘటించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బారిష్టర్ పట్టా పుచ్చుకుని స్వదేశానికి వచ్చి స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా పాల్గొని, స్వాతంత్ర్యం తరువాత భారత ఉప ప్రధానిగా ఎనలేని సేవలు అందించారని, హైదరాబాద్, జునాగఢ్ వంటి పెద్ద సంస్థానాలు భారతదేశంలో విలీనం చేయడానికి ఉక్కు సంకల్పంతో పని చేసిన యోధుడని విద్యార్థులకు అధ్యాపకులు వివరించారు. సంకల్పబలం ఉంటే లక్ష్యాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరేంద్రనాథ్ పట్నాయిక్, రేణుక, పద్మావతి, అమిత, బర్ష, పాపారావు, వాణి, దేవకి, పి.డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.